ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024
8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

ఓటేయాలంటే..

ప్రజలకు నమ్మకం కలగొద్దా!

- ట్రాఫిక్ కష్టాలు ఇంకెన్నాళ్లు..
- ఆస్తిపన్ను తగ్గించే హామీ ఇవ్వగలరా ?
- విశాఖ పార్లమెంట్ పరిధిలో ప్రధాన పార్టీలకు సవాళ్లు





ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈసారి జరిగే ఎన్నికలైనా ప్రజాసమస్యలపై ప్రత్యామ్నాయం చూపించగలవా ? విశాఖ నగరంలో జనంపై పడే భారాల నుంచి విముక్తి కలిగించగలవా ? అన్న చర్చ సామాన్యుల్లో సాగుతోంది. విశాఖ పార్లమెంట్ స్థానంలో నెలకొన్న పలు సమస్యలు ప్రధాన పార్టీలకు సవాళ్లుగా పరిణమిస్తున్నాయి. వైసిపి, టిడిపి - జనసేన - బిజెపి కూటమి ప్రచార సమయంలో ఎక్కడికక్కడ స్థానిక సమస్యలు ఆయా పార్టీలను నిలేయనున్నాయి.

విశాఖ పార్లమెంట్‌కు అభ్యర్థులంటే వలస నాయకులేనన్న భావన ఉంది. ప్రతి ఎన్నికలోనూ ఇక్కడకు ఎవరో ఒకరు దిగుమతి అవుతారన్న చర్చ ఈ ప్రాంతంలో తొలినుంచీ ఉన్నదే. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, పురంధరేశ్వరి, ఎంవివిఎస్.మూర్తి, ఎంవివి.సత్యనారాయణ, కంభంపాటి హరిబాబు ఇలా చెప్పుకుంటూపోతే అనేక మంది కోస్తా, రాయలసీమ జిల్లాల నుంచి వచ్చి పార్లమెంట్ బరిలో నిల్చొని గెలిచాక సొంత వ్యాపార అజెండాతో కాలం గడిపిన వారు తప్ప నగరాభివృద్ధికి చేసిన కృషి దాదాపు ఎవ్వరిలోనూ లేదు. ముఖ్యంగా నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని పరిగణలోకి తీసుకుంటే 2010లోనే విశాఖలో ఎనిమిది ఫ్లై ఓవర్‌లు ఉండాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ), జివిఎంసి సంయుక్తంగా ఇంజినీరింగ్ అధికారులతో నివేదిక రూపొందించాయి. కానీ ఏ ఎంపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు నగరంలో నానాటికీ తీవ్రమై ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతూనే ఉంది.

ఆస్తి పన్ను రుద్దారు..!

కేంద్రం ఆస్తి పన్నును నగర ప్రజలపై రుద్దింది. దీన్ని రద్దు చేస్తామని వైసిపి, టిడిపి పార్లమెంట్ అభ్యర్థులు హామీ ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు. కనీసం తగ్గిస్తామన్న హామీ కూడా దొరికేలాలేదు. ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ విశాఖ అని చెప్పి ప్రోపర్టీ టాక్స్‌ను పెంచేశారు. క్యాపిటల్‌కు, ఇక్కడ భూములకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఆస్తిపన్ను మాత్రం పెరిగిపోయింది. రాష్ట్రాలపై మిగతా 2లో..

వైసిపిలో వీడిన సందిగ్ధం

- అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా మంత్రి బూడి ముత్యాలనాయుడు
- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా తనయ అనురాధ
- సామాజిక సమీకరణలో మార్పులు



బూడి ముత్యాల నాయుడు
(వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి)



అనురాధ
(వైసిపి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, వి.మాడుగుల విలేకరి

వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిపై సందిగ్ధం తొలగింది. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి స్థానంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడుకు పార్టీ అధిష్టానం టిక్కెట్ కేటాయించింది. ఆయన తనయ, కె.కోటపాడు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధను ప్రస్తుతం ముత్యాలనాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. గతంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్యాలనాయుడును వైసిపి ప్రకటించింది. ఎంపీ స్థానాలకు సంబంధించి రాష్ట్రంలో అన్నింటికీ అభ్యర్థులను ప్రకటించినా అనకాపల్లి ఎంపీ టిక్కెట్‌ను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి బిజెపి అభ్యర్థిగా కడప జిల్లాకు చెందిన వెలమ సామాజిక తరగతికి చెందిన సిఎం రమేష్‌ను బరిలో దించే అవకాశాలున్నాయని గుర్తించి ఇలా వేచిచూసింది. అదివారం బిజెపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సిఎం రమేష్‌ను ప్రకటించడంతో సామాజిక సమీకరణలో కొప్పల వెలమకు చెందిన ముత్యాల నాయుడును బరిలోకి దించాలని జగన్మోహన్‌రెడ్డి భావించారు. దీంతో అనూహ్యంగా ముత్యాలనాయుడు పేరు తెరమీదకు వచ్చింది. అనకాపల్లి ఎంపీగా పోటీ చేయాలన్న మిగతా 2లో..

ఉబర్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

వార్త 2లో..

పోర్టు క్రీడాకారులకు సత్కారం

వార్త 2లో..

డ్రగ్స్ కేసులో దోషులను శిక్షించాలి : ఐద్వా

వార్త 4లో..

టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షునిగా బాబ్జీ



గండి బాబ్జీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం ఆ పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జిగా ఉన్న గండి బాబ్జీ నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఈ మేరకు బాబ్జీని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా మూడేళ్ల క్రితం నియమితులై నియోజవర్గంలో టిడిపి కార్యక్రమాలు నిర్వహిస్తూ రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేయాలని బాబ్జీ భావించారు. అయితే ఆయనకు పొత్తులో భాగంగా టిక్కెట్ రాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన పార్టీకి రాజీనామా చేసే వరకూ వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయనను టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ నియోజవర్గం ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్ కలిసి సంప్రదింపులు జరిపారు.

ఆయన్ని వెంటబెట్టుకొని చంద్రబాబు నాయుడును కలిశారు. చంద్రబాబు బాబ్జీని బుజ్జగించారు. ఈ పూర్వ రంగంలో బాబ్జీ తిరిగి దక్షిణ టిడిపి ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ ఇప్పుడు పార్టీ పార్లమెంటు అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇంతవరకు పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షునిగా ఉన్న పల్లా శ్రీనివాసరావుకు గాజువాక నుంచి ఆ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించారు. దీంతో పల్లా శ్రీనివాసరావు బాధ్యతను గండి బాబ్జీకి పార్టీ అప్పగించింది.

ఆదాయార్జనలో వాల్తేరు రైల్వే రికార్డు

- రూ.10 వేల కోట్లను దాటేసిన డివిజన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతీయ రైల్వేలోని వాల్తేరు డివిజన్ కొత్త రికార్డు సృష్టించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఐదు రోజులకు ముందే తొలిసారిగా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని అధిగమించి చారిత్రాత్మక విజయం సాధించిందని రైల్వే శాఖ సీనియర్ డిసిఎం ఎకె.త్రిపాఠి తెలిపారు. తాజా రికార్డు నేపథ్యంలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం మాట్లాడుతూ సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు.

అంకితభావం, సమిష్టి కృషితోనే ఇదంతా సాధ్యమైందని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయార్జనలో మంచి వృద్ధి కనిపిస్తోందన్నారు. కస్టమర్-ఫోకస్డ్ వ్యూహాలు, కస్టమర్లతో సన్నిహిత సమన్వయం, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ మెరుగుదల, ప్రయాణికులకు మంచి సౌకర్యాలు వంటివి తాజా విజయానికి కారణమయ్యాయని తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎక్కడా తాగునీటి కొరత లేకుండా అవసరమైన ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తాగునీరు వృథా కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం కలిగించాలని చెప్పారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత అంశాలపై జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి, ఆర్‌డబ్ల్యుఎస్, నీటి వనరులు, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని, అదే ఇంకా కొనసాగుతోందని తెలిపారు. కావున నీటి సౌలభ్యాన్ని ముందే అంచనా వేసుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటిని సరఫరా చేయాలన్నారు. మంచినీటి బోర్లు, మోటార్లు, పైపులు, ట్యాపులు మరమ్మతులకు మిగతా 2లో..

ఉబర్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉబర్‌లో తిరుగుతున్న ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆన్‌లైన్‌లో తిరుగుతున్న ఆరు గ్రూపుల నుంచి నాయకులు, కార్మికులు పాల్గొన్న ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో విశాఖపట్నంలో దాదాపుగా 56 వేల మంది కార్మికులు తిరుగుతున్నారని, అందులో భాగంగా ఉబర్‌లో తిరుగుతున్న ఆటో డ్రైవర్లకు అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరామని అన్నారు. వారి నుంచి స్పందన కరువైందని తెలిపారు. బేస్మెంట్ ఛార్జి రూ.30 ఉన్నదాన్ని రూ.20కి తగ్గించారని, నైట్ టైం వన్ అండ్ ఆఫ్ ఛార్జ్ ఇవ్వాల్సి ఉండి కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఏదైనా సమస్య వస్తే కాల్ సెంటర్ కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. ఆటో కార్మికులపై వేస్తున్న జిఎస్‌టిని రద్దు చేయాలని కోరారు. ప్రయాణానికి తగ్గ ఛార్జీలు రావట్లేదని, ప్రయాణించే ముందు ఒకరేటు, తదుపరి ఒక రేటు చూపిస్తున్నారని, అందువల్ల కనీసం రూ.10 నుంచి రూ.20 వరకు నష్టం కలుగుతోందని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో శేషుబాబు, నేతాజీ, శ్రీధర్, వరప్రసాద్, జిఎస్.ప్రకాష్, సిఐటియు జిల్లా నాయకులు బి.జగన్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ప్రజలకు నమ్మకం కలగొద్దా!

రుద్దిన కేంద్ర పన్ను భారాన్ని పార్లమెంట్‌లోనూ, బయటా వైసిపి, తెలుగుదేశం రెండూ సమర్థించుకున్నాయి. బిజెపికి ఢిల్లీ స్థాయిలో దాసోహం అనేలాగ ఆస్తిపన్నుపై ఎలాంటి పోరాటమూ వైసిపి, టిడిపి, జనసేనలు చేయలేదు. జరుగబోయే 2024 ఎన్నికల్లో పార్లమెంట్ స్థానానికి పోటీచేస్తున్న వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, టిడిపి నుంచి పోటీచేసే గీతం విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీభరత్ ప్రాపర్టీ ట్యాక్స్ లేకుండా, నగర ప్రజలపై భారం పడకుండా చూస్తామన్న హామీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టగలరా ? అన్నది విశాఖ వాసులు అడుగుతున్న ప్రశ్న. సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు మాత్రమే ఈ పన్నులపై గడిచిన కాలంలో పోరాటాలు చేపట్టాయని పలువురు గుర్తుచేస్తున్నారు.

వైసిపిలో వీడిన సందిగ్ధం

జగన్మోహన్‌రెడ్డి సూచనను కాదనలేని ముత్యాలనాయుడు సుముఖత వ్యక్తంచేస్తూ తన కుమార్తె అనురాధకు మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి అందుకు సమ్మతించడంతో బూడి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ మేరకు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ముత్యాల నాయుడును, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా అనురాధను వైసిపి ప్రకటించింది.

మాడుగుల నుంచి 2014, 2019 ఎన్నికల్లో ముత్యాలనాయుడు గెలిచారు. మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానని ధీమాగా వున్న ఆయన అనివార్యంగా ఎంపీగా పోటీచేయాల్సివచ్చింది. ముత్యాల నాయుడు ఉప సర్పంచ్ స్థాయి నుంచి దశల వారీగా రాజకీయ మెట్లు ఎక్కుతూ వైసిపి ప్రభుత్వ రెండోసారి మంత్రివర్గ విస్తరణలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు.

ఇదీ అనురాధ నేపథ్యం

బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులకు అనురాధ 1986 నవంబరు 4న జన్మించారు. ఇంటర్ వరకు చదువుకున్నారు. 2021 జిల్లా పరిషత్ ఎన్నికల్లో కె.కోటపాడు జెడ్‌పిటిసిగా గెలిచారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా, అనకాపల్లి జిల్లా వైసిపి మహిళా విభాగ అధ్యక్షురాలిగా ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

గుర్తైతే తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏలేరు, గోదావరి, గోస్తనీ, రాయపూడి, తాటిపూడి, మేఘాద్రి గెడ్డ, గంభీరం, ముడసర్లోవ నుంచి తాగునీరు లభిస్తోందని అన్నారు. ఏలేరు నుంచి అధిక శాతం నీటిని విశాఖ సిటీ వరకు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కొన్నింటిలో నీటిసాంద్రత తక్కువగా ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఇటువంటి పరిస్థితిల్లో ఏలేరు నుంచి మేఘాద్రి గెడ్డకు పంపింగ్ ద్వారా నీరు చేరేలా తొలిసారి ప్రయత్నం చేయనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 15 నుంచి జులై వరకు ఈ ప్రయోగం చేయడం ద్వారా రోజుకు అదనంగా 50 క్యూసెక్కుల నీటిని విశాఖ ప్రజలు వినియోగించుకునే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ కెవివి.చౌదరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ డి.సత్యనారాయణ, జివిఎంసి వాటర్ సప్లయి పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎన్.రవి, వాటర్ రీసోర్సెస్ పర్యవేక్షక ఇంజినీర్ కె.సూర్యకుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎంవిఎ.శ్రీనివాసరావు, ఇతర విభాగాల ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సెవెన్ హిల్స్ కార్మికులు

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భగత్ సింగ్ స్ఫూర్తితో యువత దేశభక్తి కలిగి ఉండాలని, రానున్న ఎన్నికల్లో దొంగ దేశభక్తులను ఓడించాలని సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌలి పిలుపునిచ్చారు. మంగళవారం సెవెన్ హిల్స్ ఆసుపత్రి వద్ద భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కార్మికులకు, రైతులకు, ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలు చేస్తోందని, కార్పొరేట్ సేవలో మునిగి తేలుతోందని అన్నారు. సిఎఎ చట్టాన్ని తీసుకువచ్చి ప్రజలను పౌరులుగా నిరూపించుకోవాలని అంటోందన్నారు. మతం పేరుతో విడదీసి దేశ సమైక్యతను దెబ్బతీస్తోందన్నారు. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో సరైన వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి సీనియర్ నాయకులు పాపాయమ్మ, సత్యవతి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సెవెన్‌హిల్స్ కార్మికులు చిన్న రమణ, పెద్ద రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సులతో ఆసరా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బీచ్ రోడ్డులోగల బివిఎఫ్ బ్రిడ్జి స్కూల్ ఆవరణలో మహిళలకు కొవ్వొత్తుల తయారీపై ఉచిత శిక్షణ కార్యక్రమం ఆరంభమైంది. మంగళవారం ఈ కార్యక్రమాన్ని బాల వికాస ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తీరిక సమయంలో స్వయం ఉపాధి కోర్సులపై దృష్టిసారించి కుటుంబానికి ఆసరాగా ఉండాలని సూచించారు. జన శిక్షణా సంస్థాన్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో 32 మంది మహిళలు పాల్గొన్నారు. శిక్షకురాలు రమణి కుమారి, జన శిక్షణా సంస్థ సభ్యులు మనోహర్, మహాలక్ష్మి, శ్రీదేవి, కుమారి పాల్గొన్నారు.

పోర్టు క్రీడాకారులకు సత్కారం



పతకాలు సాధించిన వారితో పోర్టు ఛైర్మన్ అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 45వ అఖిల భారత ప్రధాన పోర్టుల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పోర్టు క్రీడాకారులను విశాఖ పోర్టు ట్రస్టు ఛైర్మన్ అంగముత్తు మంగళవారం సత్కరించారు. కొల్‌కతాలో జరిగిన ఈ పోటీల్లో విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఒక బంగారు, రెండు వెండి, రెండు బ్రాంజ్ పతకాలు సాధించారు. 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో జివిఎస్.రామారావు బంగారు పతాకాన్ని, 50 ప్లస్ డబుల్స్ విభాగంలో శ్రీధర్ రాజు వెండి పతకాన్ని, మెన్స్ డబుల్స్ విభాగంలో రామారావు, కె.రఘురామ్‌లు వెండి పతకాన్ని, పురుషుల సింగిల్స్ విభాగంలో రామారావు బ్రాంజ్ పతకాన్ని సాధించారు. అదేవిధంగా మొత్తంగా విశాఖపట్నం పోర్టు టీం ఓవరల్ స్థాయి బ్రాంజ్ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ అంగముత్తు క్రీడాకారులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, సీనియర్ డిప్యూటీ సిఎఒ శివకుమార్, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లపై బొజ్జల వ్యాఖ్యలు బాధాకరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వార్డు వాలంటీర్లపై టిడిపి నేత, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం లాసన్స్ బే కాలనీలోగల తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటీర్లను జిహాదీ తీవ్రవాదులు, టెర్రరిస్టులతో పోల్చడం దారుణమన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించడంలో వాలంటీర్లది కీలకపాత్ర అని అన్నారు. అటువంటి వారిపై అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ వ్యవహారంలో జగన్ హస్తం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో వెలుగు చూసిన డ్రగ్స్ వ్యవహారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హస్తం ఉందని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆరోపించారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో ఎప్పటినుంచో డ్రగ్స్ మాఫియా వేళ్లూనుకుని ఉందన్నారు.

విశాఖ పోర్టు, ఐసిటిపిఎల్ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిపిపి పద్ధతిలో వెస్ట్ క్యూ 6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణపై మంగళవారం ఉదయం విశాఖ పోర్టు ట్రస్ట్, ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆధునికీకరణ వైపునకు పోర్టు సాగుతోందన్నారు.

సిఐటియు జిల్లా కార్యాలయానికి కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న కూన వెంకటరావు కుటుంబీకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు విశాఖ జిల్లా కార్యాలయానికి స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి, మాధవధార వాసి కూన వెంకటరావు రూ.40 వేలు ఖరీదుచేసే కంప్యూటర్ బహూకరించారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావులకు కూన వెంకటరావు భార్య జనార్ధనమ్మ, కుమార్తె మృదులతో కలిసి కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కూన వెంకటరావు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిగా ఉన్నంతకాలం కార్మికుల సమస్యలపై పనిచేసారని, సిఐటియు ఎదుగుదలకు కృషి చేసారని తెలిపారు.

ఆయన కుమారుడు ఆవినాష్ పేరుతో అవినాష్ సేవా ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. వెంకటరావు కుటుంబానికి సిఐటియు, సిపిఎం జిల్లా కమిటీల తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. కూన వెంకటరావు మాట్లాడుతూ సిఐటియు నిరంతరం కార్మిక హక్కుల కోసం పోరాడుతోందని, ఆఫీస్ అవసరాలను గుర్తించి కంప్యూటర్‌ను అందజేశానని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

ఘనంగా పైడిమాంబ జాతర

ప్రజాశక్తి - ఆరిలోవ : పాతడెయిరీఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునుంచే విశాలాక్షినగర్, మధురవాడ, ఎండాడ, ఆరిలోవ, ఆదర్శనగర్, రవీంద్రనగర్, హనుమంతువాక పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

గీతం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక రుషికొండ, వాడపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యాన ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలన్నారు. ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాధ్యతను మరవకూడదన్నారు. గీతం విద్యార్థులు పాఠశాలలను దత్తత స్వీకరించి నిరంతర కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ గురించి వివరించారు. 100 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మూడు రోజుల పాటు పాఠశాల విద్యార్థులతో గడిపి వారికి వివిధ పోటీలను నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. బాలికలకు ఆరోగ్యపరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్.త్రినాద్‌రావు, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.వనిత, కె.యశోద, వి.సత్యఅరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని తునివలసలో గ్రామదేవత బంగారమ్మ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం తొలి కార్యక్రమంతో ప్రారంభమై మంగళవారం అనుపు కార్యక్రమం నిర్వహించినట్లు సర్పంచ్ సుంకర పైడిరాజు తెలిపారు. ఏటా 30 గ్రామాల భక్తులు పాల్గొని ఈ పండుగను నిర్వహిస్తారని వివరించారు.

వరుదు కల్యాణికి సత్కారం

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన తరువాత మొట్టమొదటిసారిగా విశాఖపట్నంలోని వైసిపి కార్యాలయానికి వచ్చిన వరుదు కల్యాణిని మంగళవారం నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, కృపాజ్యోతి, యువశ్రీ, శ్రీదేవివర్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వరుదు కల్యాణిని సత్కరిస్తున్న రవిరెడ్డి తదితరులు

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దని స్థానిక ఆర్‌డిఒ, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కరరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికార్లతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఓటరు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఏ డోర్ నంబర్‌లో ఉంటున్నారు అన్నదీ ఇప్పటికే తెలిసి ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకూ స్లిప్పులు ఇవ్వడం ద్వారా ఓటింగ్ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. నిష్పక్ష పాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో భీమిలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా జగన్మోహన్‌రెడ్డి పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, ఆదిబాబు, ఈశ్వరరావు, భాస్కరరావు, శ్రీను, జివికె.వర్మ, గోవిందా తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం జివిఎంసి మూడో వార్డు పరిధిలోని ఎగువపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, వి.కొండబాబు, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభం మండలం కొవ్వాడ, గంధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -తగరపువలస : వన్య ప్రాణుల సంరక్షణ, నీటి ఆవశ్యకత అంశాలపై భీమిలి మండలంలోని చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులకు చిప్పాడ దివీస్ సంస్థ ఇటీవల నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖన పోటీల్లో విజేతలకు మంగళ వారం బహుమతులు అందజేశారు. స్థానిక దివీస్ సంస్థ పరిపాలనా విభాగం కార్యాలయంలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ వైవిఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, వన్య ప్రాణులను వేటాడటం తీవ్ర నేరమని స్పష్టం చేశారు. జల వనరులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇసిడి డిపార్ట్‌మెంట్ మేనేజర్ ఆర్.ప్రసాద్, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో ఎమ్మెల్యే వెలగపూడి పర్యటన



వార్డు పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాల్లో టిడిపి ఇన్‌ఛార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం పర్యటించారు. వినాయకనగర్, బాలమురళీనగర్, శివాలయం వీధి, ఈశ్వరదేవీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సింహాచలం దేవస్థానం భూముల సమస్య, మంచినీటి సమస్యను ఎమ్మెల్యేకు స్థానికులు విన్నవించుకున్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టిడిపి నాయకులు ఒమ్మి పోలారావు, గాడి సత్యం, ఎడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేధో హక్కులపై గీతంలో కార్యశాల

ప్రజాశక్తి -మధురవాడ : మేధోహక్కులపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన మంగళవారం ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. గోవా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్ బంకర్ ముఖ్య అతిథిగా హజరై ప్రసంగించారు. ప్రస్తుత శాస్త్ర సాంకేతిక యుగంలో మేధోహక్కుల ప్రాధాన్యత పెరుగుతోందని వివరించారు. నూతన ఆవిష్కరణలను వాణిజ్య పరంగా ప్రయోజనకరంగా మార్చుకోవాలంటే మేధోహక్కులు పొందడం అవసరమని చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీలగిరి తోట దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మింది వానిపాలెంలో మంగళ వారం మధ్యాహ్నం సుమారు మూడు ఎకరాల నీలగిరి తోట అగ్నికి ఆహుతి అయింది. ఆనందపురం మండలం సొంట్యాం రెవెన్యూ పరిధి మిందివానిపాలెం సర్వే నెంబర్ 347/ 5లో సవరవెల్లి రాంబాబుకు చెందిన సుమారు మూడెకరాల నీలగిరి తోట దగ్ధమైంది. తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కొంతమేర మంటలను అదుపు చేశారు. సుమారు మూడు లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని యజమాని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా భూమి యజమాని కోరుతున్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డులో ప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డు ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి, ఆపై ఆగి ఉన్న మూడు బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... హనుమంతువాక నుంచి సింహాచలం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి కుడివైపు రోడ్డులో ప్రయాణిస్తున్న బైక్‌ను, మరో రెండు బైక్‌లను ఢీకొట్టింది. బైక్ మీద ప్రయాణిస్తున్న ఇద్దరికి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుపుతున్న వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యారు. కారు నడుపుతున్న వ్యక్తి మహిళగా అనుమానిస్తున్నారు. ఆరిలోవ ట్రాఫిక్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : రావికమతం మండలంలో గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి చెందిన ఎం.రాము అనే వ్యక్తి ఇంటి వద్ద విక్రయిస్తున్న 20 లీటర్ల నాటుసారాతోపాటు అతని వద్ద 300 లీటర్ల బెల్లం పులుపు పట్టుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో పోలీసు సిబ్బందితో నిఘాపెట్టి, సారా అమ్మకాలపై దాడులు నిర్వహించామని పోలీసులు తెలిపారు. సారా తయారీ అమ్మకాలు, బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు చట్టరీత్యా నేరమని, పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రత్నంపేట జంక్షన్‌లో 10 లీటర్లు సారాతో మహిళ అరెస్ట్

పది లీటర్లు నాటుసారా పట్టుకుని వెళతుండగాకొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పప్పుల జ్యోతిని కెడీపేట ఎస్ఐ ఉపేంద్ర సిబ్బందితో మంగళవారం పట్టుకున్నారు. కొంగసింగి రహదారిలో రత్నంపేట జంక్షన్ వద్ద నాటుసారా స్వాధీనం చేసుకుని, నిందితురాలిపై కేసు నమోదు చేశామన్నారు.

పలుచోట్ల మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : 11 మద్యం క్వార్టర్ బాటిళ్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేశామని గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని యర్రవరం గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేశామన్నారు. నిందితుడు అమరాపల్లి వెంకటరమణను అరెస్టు చేశామన్నారు.

గొలుగొండ మండలంలో చోద్యం గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎన్ఇబి ఎస్ఐ రహీం తెలిపారు. చిక్కాల అప్పలరాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అచ్చయ్యపేట గ్రామంలో సారా తయారీ స్థావరంపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని తెలిపారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామానికి చెందిన దొడ్డి యశోద కృష్ణ మద్యం షాపు నుండి కొనుగోలు చేసి తరలిస్తున్న 10 మద్యం బాటిళ్లను పరవాడ మంగళవారం పట్టుకున్నట్లు సిఐ బాల సూర్యారావు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఆయన వద్ద నుండి రూ.1530 విలువ గల 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే తానాం గ్రామానికి చెందిన అల్లు లక్ష్మణరావు తన పాన్‌షాప్‌లో అక్రమంగా మద్యం అమ్ముతుండగా అతనిని కూడా అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుండి 765 రూపాయలు విలువ గల 5 మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాల సూర్యారావు తెలిపారు.

మార్టిన్ లూథర్‌కింగ్ సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నెలవారీ సినిమా ప్రదర్శనలో భాగంగా మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయం హాలులో 2003లో విడుదలై సంచలనం సృష్టించిన మార్టిన్ లూథర్‌కింగ్ సినిమాను ప్రదర్శించారు. మహిళా దర్శకులు పూజిత కొల్లూరి మొదటిసారిగా దర్శకత్వం వహించిన ఈ సినిమా పలువురి ప్రశంసలు అందుకుంది. ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపే అంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం మన హక్కు అన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పని సరిగా ఓటు వేయాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన నగర కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కెసిహెచ్.గోపినాయుడు, మల్లికను సత్కరించారు. చిత్ర ప్రదర్శన అనంతరం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, ఉషారాణి, కృష్ణారావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

18 ఏళ్లలోపు వారిని రాజకీయ ప్రచారాల్లో భాగస్వామ్యం చేయొద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్ల లోపు బాలలను ఎటువంటి రాజకీయ ప్రచారాలు, రాజకీయ పార్టీల సామగ్రి సరఫరా, పంపిణీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయొద్దని ఎపి బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారామ్, జంగం రాజేంద్రప్రసాద్, త్రిపర్ణ ఆదిలక్ష్మి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, బాలలను ఎన్నికల్లో భాగస్వామ్యం చేస్తే ఆయా రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రచారాలకు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటనలకు, సామగ్రి తరలింపునకు, సమావేశాలకు, చిన్న చిన్న పనులకు కొద్ది రోజులుగా బాలలను వినియోగిస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి అంశాలపై తాము నిశితంగా పరిశీలిస్తామని స్పష్టంచేశారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం : సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషినల్ ఎస్‌పి బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు పర్యవేక్షణలో భీమిలి క్రాస్ రోడ్‌లోని పోలీస్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, నగదు అక్రమ రవాణా, ఇతర మత్తుపదార్థాలను వాహనాలతో రవాణా చేస్తుండటంతో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సెబ్ ఎఇఎస్ యు.సుబ్బారావు, సిఐ రాజులనాయుడు, భీమిలి సెబ్ సిఐ వి.రామకృష్ణ, ఎస్ఐలు పి.చిన్నంనాయుడు, వి.వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రతినిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషన్ (ఇండియా-గల్ఫ్) నషీద్ చౌదరి, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసఫ్‌లు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల కేసులో దోషులను శిక్షించాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పోర్టులో పట్టుబడిన మాదకద్రవ్యాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. ఐద్వా గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన దశమకొండలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విశాఖలో సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు చెందిన రొయ్యల మేత పేరుతో డ్రగ్స్ దిగుమతి చేస్తుండటాన్ని అత్యంత రహస్యంగా ఉంచారని, దీని వెనుక వైసిపి, తెలుగుదేశం, జనసేన, బిజెపిల పాత్ర ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. నిఘా వ్యవస్థ వైఫల్యం స్పష్టమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా ఎన్నాయో కూడా ఈ ఘటన తెలియజేస్తుందన్నారు. సంధ్యా మెరైన్ ఎమ్‌డి కూన వీరభద్రరావు, డాక్టర్ కెవి.ప్రసాదరావు కలిసి ఆక్వా ఎక్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ కెవి.ప్రసాదరావు స్వయాన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధరేశ్వరి వియ్యంకుడు అని చెప్పారు. వీరు పినాకిల్ హస్పటల్‌ను కూడా నడుపుతున్నారు. సమాజానికి సేవచేయాల్సిన వారు డ్రగ్స్ దిగుమతి చేసే వ్యాపారం చేయడమంటే సమాజాన్ని మరింత దిగజార్చడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీరికి బిజెపి, తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.

డ్రగ్స్ పట్టుబడిన కంటైనర్ టెర్మినల్‌ను జెఎం.భక్సీ (ముంబాయి) నిర్వహిస్తోందని, విశాఖ కంటైనర్ టెర్మినల్ 33 ఏళ్ల పాటు పిపిపి క్రింద 2002లో ఆనాటి కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం లీజుకిచ్చిందని తెలిపారు. అప్పటి నుంచి జెఎం.భక్సీ నిర్వహణలో ఉందని వివరించారు. ఈ సంస్థకు సంధ్యా ఆక్వా సంస్థకు మధ్య ఎలాంటి సంబంధాలున్నాయో బహిర్గతం చేయాలని డిమాండ్‌చేశారు. వచ్చిన ప్రతి కంటైనర్‌నూ స్కాన్ చేసి లోపల కార్గో ఏమిటో నిర్ధారించాల్సి ఉన్నా అలా జరిగినట్లు లేదన్నారు. ప్రైవేట్ సంస్థ క్రింద పోర్టు బెర్తులు ఉండటం వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. విశాఖ వంటి మేజర్ పోర్టును ప్రైవేటీకరిస్తే దేశ భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు వై.సత్యవతి, కె.సంతోషం, జోన్ నాయకులు వై.మంగ, దశమకొండ కమిటీ సభ్యులు కుసుమ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, వై.జ్యోతి, సిఐటియు నాయకులు పి.నరసింగరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

7న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్తంగా ఏప్రిల్ 7న ఉగాది సంబరాలను నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ్ తెలిపారు. డైమండ్ పార్కు సమీపంలోని ఒక ప్రయివేట్ హోటల్‌లో అర్బన్ యూనిట్ కార్యవర్గం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చేస్తున్న ఏర్పాట్లపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, నారాయణ్ మాట్లాడుతూ, ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 9 గంటలకు నగరంలోని సింకా గ్రాండ్‌లో ఉగాది సంబరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. తదుపరి పండితులచే కవిసమ్మేళనం, పంచాంగశ్రవణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచాంగం పుస్తకాలను అందజేస్తామన్నారు. మధ్యాహ్నం విందుభోజనం వరకు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు లక్కీడిప్ ఉంటుందని తెలిపారు. ఈ సంబరాల్లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ యూనియన్లు నిరంతరం పాటుపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఎపి బ్రాడ్ కాస్ట్ అర్బన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.మురళీకృష్ణ, చింతా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి నూకరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : తమ సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు ఇస్తామని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సమావేశం తీర్మానించింది. విశాఖలోని నర్సింహనగర్‌లో ఆంధ్రప్రదేశ్ యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ బసరమాని ఈశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ గొడ్డు కన్నారావు అధ్యక్షతన మంగళవారం యాత జాతీయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో యాతజాతీయులు ఎదుర్కొంటున్న సమస్యలు - లభించిన పరిష్కారాలపై చర్చించారు. యాతజాతీయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు వైసిపి ప్రభుత్వం పరిష్కారం చూపిందని, ఇంకా పరిష్కరించాల్సినవి అనేకం ఉన్నాయని సమావేశం పేర్కొంది. అన్ని సమస్యలను పరిష్కరిస్తే వైసిపికి మద్దతు ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వారికి పూర్తిస్థాయి మద్దతు ఇస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో కొల్లి సింహాచలం, సంపంగి మంగరాజు, వనుము దేముడు, నోట్ల శేఖర్, కొలుసు సత్యం, దమ్ము రమణ, సిమ్మా గోవింద్, రెడ్డి సన్యాసిరావు, పెంకే మారేష్, కోసెట్టి రమణ, పోలవరపు సత్తిబాబు, కరెట్ల అప్పలరాజు, లావేటి నాగరాజు, వివిధ జిల్లాల ముఖ్య కులప్రతినిధులు సుమారు 100 మంది పాల్గొన్నారు.

దక్షత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యాన మూడు రోజులు నిర్వహించే దక్షత శిక్షణ కార్యక్రమాన్ని డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 మంది పట్టణ/ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు, స్టాఫ్ నర్సులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేటట్లు ప్రోత్సహించాలని, మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిగర్భిణీ 12 వారాలలోపు నమోదు చేసుకోవాలన్నారు. హై రిస్క్ గర్భవతులను త్వరితగతిన గుర్తించి మెరుగైన వైద్య సహాయం నిమిత్తం రిఫరల్ హాస్పిటల్‌కు పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఒ డిపిఎంఒ డాక్టర్ బి.ఉమావతి, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త డాక్టర్ సమత, కెజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిల, డిపిహెచ్‌ఎన్‌ఒ ఐ.మనోరమ, హెచ్‌ఇఒ కె.ధర్మేంద్ర, నాగభూషణం పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఎఫ్‌డిఎ శాస్త్రవేత్త

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఎఫ్‌డిఎ సీనియర్ శాస్త్రవేత్త వై.శ్రీరామకృష్ణయ్య మంగళవారం సందర్శించారు. ఏయూ ఫార్మశీ కళాశాల పూర్వవిద్యార్థి, పూర్వ ఆచార్యుడు వై.శ్రీరామకృష్ణయ్య ముందుగా కళాశాల ఆచార్యులతో సమావేశమయ్యారు. ఫార్మ రంగంలో జరుగుతున్న మార్పులు, అభివృద్ధిపై చర్చించారు. ఫార్మ కళాశాలలో జరుగుతున్న నూతన అభివృద్ధి కార్యక్రమాలను, నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూ ప్రగతికి తానుసైతం కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున శ్రీరామకృష్ణయ్యను వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఆచార్య ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ : గుంటూరు

ప్రజాశక్తి-పెందుర్తి: అభిమానులు, కాపు సంఘం నాయకుల నిర్ణయం మేరకు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాపు సంఘం నాయకులు గుంటూరు వెంకట నరసింహారావు తెలిపారు. సోమవారం వైసిపికి రాజీనామా చేసిన నరసింహారావు వాట్సప్ గ్రూపు ద్వారా జిల్లా కాపు సంఘం నాయకులు, అభిమానులతో తన పోటీపై ఒపీనియన్ పోల్ నిర్వహించారు. ఇందులో కొందరు కాంగ్రెస్‌లో చేరాలని, మరికొందరు జనసేన సభ్యత్వం తీసుకోవాలని ప్రతిపాదించగా ఎక్కువమంది స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్దేశించినట్లు వెల్లడించారు. వారి అభిమతం మేరకు పోటీ చేస్తానని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ పింక్ కలర్ షర్టు తనకు పంపించారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోకి ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావు ఆహ్వానించారని తెలిపారు. నిస్వార్థంగా సేవ చేస్తున్న గుంటూరు వెంకట నరసింహారావు కుటుంబానికి రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయని గొర్లె నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

వేసవిలో గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్.డబ్ల్యు.ఎస్., గ్రామ పంచాయితీ, పురపాలక, నగరపాలక అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, పట్టణాలలో పరిస్థితులను గమనిస్తూ ఇంజనీరింగు, ఇతర సాంకేతిక సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. భూగర్భ జలాల నీటి మట్టాలను అంచనా వేస్తూ తదనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. జిల్లాలో మరమ్మతులకు గురైన 51 బోరు బావులను యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులను ఆదేశించారు. మండల, గ్రామ స్థాయిలో గల వాస్తవ పరిస్థితులను గూర్చి స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ఈ విషయంలో స్థానిక సంస్థలు తగిన విధంగా స్పందించాలని ఆదేశించారు. అవసరమయ్యే నీళ్ళ ట్యాంకుల గూర్చి ముందుగానే జాగ్రత్తపడాలన్నారు. నీటి వాడకం, చెరువులు కుంటలను పరిరక్షించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక, అనకాపల్లి జివియంసి శాఖల అధికార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



పోటీల్లో గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

ఇంధన పొదుపుపై పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంధన వనరుల సంరక్షణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన వనరుల పొదుపు ప్రాధాన్యతపై విద్యార్థులకు చిత్రలేఖన, నినాదాలు, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానోపాధ్యాయులు సుజాత చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలక్ష్మి, పూర్ణిమ, మాధవి, రాము, కొటాన రాంబాబు పాల్గొన్నారు.



సర్వే రాళ్లపై ఉన్న పేర్లకు సున్నం వేసిన దృశ్యం

భూరక్ష సర్వే రాళ్లకు సున్నం

- ప్రజాశక్తి వార్తకు స్పందన


ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుచ్చయ్యపేట మండలం కొన్నెంపూడి జంక్షన్‌లో వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష-2020 సర్వే రాళ్ళ గుట్టలుగా పడి వుడడంపై 'ఈ రాళ్లకు కోడ్ వర్తించదా?' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది అప్రమత్తమై మంగళవారం ఉదయమే సిబ్బందితో వెళ్లి సర్వే రాళ్లపై ఉన్న వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష-2020 పేర్లపై సున్నం పూశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అసకపల్లి పంచాయితీ పరిధి ఎర్రవానిపాలెం గ్రామంలో భార్యభర్తలిద్దరూ అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణ భారమైన నిరుపేద కుటుంబానికి యాదవ సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. గ్రామానికి చెందిన నిరుపేద కోన రాజు బోదకాలు వ్యాధితో, అతని భార్య కోన పైడికొండ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయం ఎరుకునాయుడుపాలెం గ్రామానికి చెందిన ఈపు అప్పలరాజు యాదవ సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త భరణికాన సాయినాథరావు (బాబూరావు) వెంటనే స్పందించి తన పుట్టినరోజు సందర్భంగా తను కొంత మొత్తం సమకూర్చి, మిగిలిన మొత్తం అందరి నుండి సేకరించి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా భరణికాన సాయినాథరావుకు, జిల్లా యాదవ సంఘం సభ్యులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, అసకపల్లి పంచాయితి పెద్దలు, దాతలు, యువకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న యాదవ సంక్షేమ సంఘం నేతలు

ఎన్నికల నియమావళి పాటించేలా చర్యలు

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-చోడవరం

ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు తూ.చ తప్పకుండా పాటించేలా చూడాలని, ఎటువంటి ఉల్లంఘనలు జరిగిన చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం చోడవరం సర్కిల్ కార్యాలయంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మంచి నడవకు కలిగి ఉండే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఎన్నికలు చెక్ పోస్ట్‌లతో పాటు, డైనమిక్ చెక్ పోస్ట్‌ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, నాటు సారా, మత్తు పదార్థాలు అక్రమ రవాణా, డబ్బు, ఉచిత కానుకలు తదితర పంపిణీ అరికట్టేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డిఎస్పి ఎస్ అప్పలరాజు, చోడవరం, కె.కోటపాడు, కొత్తకోట సిఐలు బి శ్రీనివాసరావు, బీసీహెచ్ సోమినాయుడు, ఎస్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కైట్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

ప్రస్తుతం భారత దేశంలో యువత పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని స్వావలంబి భారత్ అభియాన్ విశాఖపట్నం కన్వీనర్ వెలగా జగన్నాధ్ పిలుపునిచ్చారు. స్వావలంబి భారత్ అభియాన్ ప్రతినిధుల పిలుపు మేరకు ఇంచార్జ్ అగ్గాల హనుమంతరావు సారధ్యంలో కైట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం అచ్యుతాపురంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వావలంబి స్వయం ఉపాధి గురించి వివరించారు. యువత తన స్వయం కృషితో, ప్రభుత్వ సాయంతో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ యువతలో మార్పు రావాలని, అంకురా సంస్థలు స్థాపించి వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 150 మంది పైబడి యువత, ప్రిన్సిపాల్ నాయుడు, లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మండలం తేగాడలోని కస్తూరిబాయ్ గాంధీ బాల్కిల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ కశింకోట ప్రిన్సిపల్ దొండా చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మార్చి 12వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభించామని, ఏప్రిల్ 11 వ తేదీ వరకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అనాధలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్ (బడి మధ్యలో మానేసిన వారు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ తరగతుల బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును https://apkgbv.apcfss.in సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్‌డిఓ, వివిధ శాఖల అధికారులు

7 నుండి నూకాంబిక జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఏప్రిల్ 7 నుండి మే ఏడవ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. ఆలయంలో మంగళవారం సమన్వయ సమావేశం ఆర్‌డిఓ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఏపీఎస్ఆర్టీసీ, విద్యుత్తు, సమాచార శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ఎక్సైజ్ శాఖ జాతర మహోత్సవానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుజాత, ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోరుగా భరత్ కుమార్ ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం తమ్మయ్య పేట, పెద్ద సంపత్ పురం, చిన్న సంపత్ పురం గ్రామాలలో అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. మే 13వ తారీకున జరగబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో కుల మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడంతో ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్ఆర్‌సిపికి ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, గంగూపం నాగేశ్వరరావు, మొల్లేటి శివాజీ, నీలకంఠం ఎస్ లక్ష్మి, మర్రిపల్లి శోభ, స్థానిక వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న స్థానికులు



పట్టుబడిన గంజాయి, నిందితునితో పోలీసులు

4 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కె.కోటపాడు

తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి గంజాయి తరలిస్తుండగా, స్థానిక పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు కె.కోటపాడు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన కె.కార్తీక్ మంగళవారం తెల్లవారుజామున పాడేరులో నాలుగు కేజీల గంజాయి కొనుక్కొని వస్తుండగా కె.కోటపాడు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని జి.భీమవరం బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం... రావికమతం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన శృంగవరపు రాము, తన అత్తగారు సంకు మహాలక్ష్మమ్మ (65) ఇద్దరూ కలిసి తన స్కూటీపై రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. కసింకోట మండలం జి భీమవరం దగ్గరలో బ్రిడ్జి వద్ద తాళ్లపాలెం నుండి నర్సీపట్నం వైపు వెళుతున్న టిప్పర్ వాహనం స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరు కింద పడిపోయారు, రాము అత్త మహాలక్ష్మి తలకు తీవ్ర గాయం కావడంతో ఆమెను నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ తరలిస్తుండగా, హాస్పిటల్ దగ్గరలో మరణించారు. కశింకోట పోలీస్ స్టేషన్ రాము ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సిఐ వినోద్ బాబు తెలిపారు.



మహాలక్ష్మమ్మ మృతదేహం

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలు పట్టివేత

ప్రజాశక్తి - పరవాడ

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు క్వారీ లారీలను మైన్స్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం రాత్రి మండలంలోని పెదముషిడివాడ నుంచి గ్రావెల్ తరలించి లంకెలపాలెంలో అన్ లోడ్ చేస్తుండగా మైన్స్ అధికారులు తనిఖీ చేశారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఆ లారీలను పరవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన గ్రావెల్ లారీ

ఫార్మా కంపెనీ ప్రమాదంలో గాయపడి మృతి చెందిన

రాము కుటుంబానికి నష్టపరిహారం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్

అచ్యుతాపురం ఎస్ఇజెడ్, రాంబిల్లి మండల పరిధిలోని సింబయో జెనరిక్స్ ఫార్మా కంపెనీలో ఈ నెల 14న బాయిలర్ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, సోమవారం మృతిచెందిన చోడవరం మండలం, గోవాడ గ్రామానికి చెందిన ఎ.రాము కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపునకు కుదిరింది. కంపెనీలో బాయిలర్ వద్ద హాట్ వాటర్, రసాయనాలు లీకై ప్రమాదం జరగడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న రాము, నర్సింగరావు, సన్యాసిరావు తీవ్రంగా గాయపడ్డ విషయం విధితమే. కంపెనీ యాజమాన్యం వారికి విశాఖపట్నం ఆరిల్లోవ వద్ద ఉన్న అపోలో ఆసుపత్రిలో వైద్యం చేయిస్తూ ఉండగా పరిస్థితి విషమించి రాము మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని, సిఐటియు ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి వద్ద సోమవారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగిన న్యాయపోరాటం చేశారు. దీంతో మృతుని కుటుంబానికి కంపెనీ నుండి రూ.20 లక్షలు, కాంట్రాక్టర్ వద్ద నుండి రూ.2 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకారం కుదిరిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు తెలిపారు. రాంబిల్లి మండలం పెద్ద కలవలపల్లి గ్రామానికి చెందిన కే నర్సింగరావు ఏ క్షణమైనా మృతి చెందవచ్చని వైద్యులు చెబుతున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారని దేవుడునాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రమాదానికి గురైన బాధిత మూడు కుటుంబాల సభ్యులు, గోవాడ, అంబేరిపురం సర్పంచులు పెదకాలవలపల్లి మాజీ ఎంపీటీసీ ప్రసాద్, కంపెనీ జీఎం, హెచ్ఆర్, రాంబిల్లి సిఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రం అందజేస్తున్న కంపెనీ యాజమాన్య ప్రతినిధులు

ఎన్నికల నిర్వహణకు ప్రజల సహకారం అవసరం

ప్రజాశక్తి - కశింకోట

ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి ప్రజల సహకారం అవసరమని కశింకోట సిఐ వినోద్ బాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహణ సజావుగా సాగడానికి ముందస్తుగా 10 మంది రౌడీ షీటర్లతో కలిపి 350 మందిపై బైండవర్ కేసులు, నమోదు చేసినట్లు చెప్పారు. యువకులు ఈ ఎన్నికల్లో ఎటువంటి వాగ్వివాదాలకు, తగాదాలకు వెళ్లి వారి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవుపలికారు. ఎన్నికలు నియమావళిని ఏ రాజకీయ పార్టీ అతిక్రమించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో ఎటువంటి వస్తువులు, నగదు, మద్యం పంపిణీ చేస్తే సీ విజిల్ యాప్ ద్వారా తెలియజేయాలని, దానిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఎన్నికల నిబంధలపై అవగహన కల్పిస్తూ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. వేసవి కాలంలో ఆరుబయట నిద్రించి దొంగతనాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. ఇళ్లల్లో ఖరీదైన బంగారు వస్తువులు, ఎక్కువుగా నగదు ఉంచుకోవడం మంచిది కాదన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం మోసగాళ్ల బారిన పడవద్దని, అలాంటి వారి విషయంలో అప్రమత్తమై ఉండాలని సూచించారు. ఏటీఎం సెంటర్లో కూడా మోసగాళ్ల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకై తగు చర్యలు తీసుకుంటున్నాని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ వినోద్ బాబు

గంగాదేవి పండగలో పాల్గొన్న పైలా

ప్రజాశక్తి -కె.కోటపాడు

మండలం కెజె పురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గంగాదేవి తల్లి గావు పండగలో మాడుగుల నియోజకవర్గం టిడిపి, జనసేన బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు ఎడ్ల రమేష్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ ఎడ్ల తాతబాబు, యువత అధ్యక్షులు రాజు, యాదవ సంఘం అధ్యక్షులు గుంపాన గంగరాజు, రెడ్డి అప్పలనాయుడు, కొలమంచిలి రమేష్, మేడిచర్ల సర్పంచ్, యూనిట్ ఇంచార్జి పూడి నారాయణమూర్తి, అనకాపల్లి పార్లమెంటరీ తెలుగు యువత ఆర్గనైసింగ్ సెక్రటరీ పూడి శ్రీను, ఎ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులతో పైలా ప్రసాదరావు

పుట్టెడు దు:ఖంలోనూ పరీక్షకు హాజరు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : తండ్రి మరణించిన విషయం తెలిసి పుట్టెడు దు:ఖంలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలు హాజరైన సంఘటన రాజవొమ్మంగి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన పరిశిక చరణ్ మంగళవారం పదవ తరగతి పరీక్ష రాయడానికి బయలుదేరాడు. ఇంతలో చరణ్ తండ్రి పరిశిక బాలరాజు ఆకస్మికంగా మృతి చెందారు. తండ్రి మరణ వార్త చరణ్‌కు తెలిసింది. అయితే తన భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కన్నీటిని కనురెప్ప చాటున ఉంచుకొని, పుట్టెడు దు:ఖంతో పరీక్షకు హాజరయ్యాడు.

వైసిపి ప్రభుత్వంలో దోపిడీ, కక్ష సాధింపు



మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి ప్రభుత్వంలో దోపిడీ కక్ష సాధింపులు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ విమర్శించారు. స్థానిక కోట్నివీధి, మళ్ళవీధి కల్యాణ మండపాలలో మంగళవారం జరిగిన కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన ఎటిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధిని గాలికి వదిలేసారన్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనను పట్టించుకోలేదని తెలిపారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే ప్రజలకు అవసరమైన అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాల్సిన అవసరం ఉందని చెప్పారు. 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సుజల స్రవంతి పూర్తి చేయడం తన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెల్లెలికి తల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి ఆడబిడ్డలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పెంచిన పన్నులు ప్రజలకు భారంగా మారాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నారాయణ రావు, బీజేపీ నాయకులు గేదెల స్వరూప్, 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను బిసిఎలో చేర్పించేందుకు కృషి

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశ్వబ్రాహ్మణులను బిసి ఏలో చేర్పించేందుకు కృషి చేస్తామని టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు కిలారి శ్రీనివాసరావు, బాబి ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుద్ధ నాగజదీష్, పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, మాదంశెట్టి నీలా బాబు, బొడ్డేడ జోగు నాయుడు, కొణతాల అప్పలరాజు, బద్దపు ప్రసాద్, సంఘ పెద్దలు వానపల్లి కోటేశ్వరరావు, పెదబాబు, ఎందుకుర్తి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కేడర్‌తో కొణతాల సమావేశం

కశింకోట : కశింకోట మండల కేంద్రంలో జనసేన పార్టీ మండల స్థాయి, గ్రామ కమిటీలు, బూత్ కమిటీల ముఖ్య నాయకులతో అనకాపల్లి నియోజకవర్గం టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న, జిల్లా నాయకులు కామరాజు, ప్రధాన కార్యదర్శి కర్రి గోవింద, దాడి నాగరాజు, రామరాజు, కర్రి వెంకట సత్యనారాయణ, కలగట్ల సింహాద్రి పాల్గొన్నారు.

కొణతాలకు మద్దతుగా ప్రచారం

అనకాపల్లి : టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకష్ణను గెలిపించాలని కోరుతూ మంగళవారం జివిఎంసి 82వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పోలవరపు త్రినాథ్, తాడి రామకృష్ణ, కర్రి రామకృష్ణ, ఆళ్ల రామచంద్ర రావు, దాడి జగన్, బర్నికాన రమణబాబు, అప్పికొండ గణేష్, గల వినోద్, గండిబోయిన శ్రీనివాస్, బొబ్బిలి సురేష్, కోయిలాడు గణేష్, అండి బోయిన శేషు, బర్నికాన రామకృష్ణ, ముప్పిడి మణికంఠ, పేకేటి రమేష్, బగాన రామారావు, ఎర్రంశెట్టి వెంకట్, తుట్ట పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా డౌన్ సిండ్రోమ్ వ్యాధిపై స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు బి. మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అప్పలనాయుడు, బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ. డౌన్ సిండ్రోమ్ వ్యాధి పూర్తిగా జన్యు సంబంధమైన వ్యాధి అని, క్రోమోజోముల అపసవ్యతతో ఈ వ్యాది వస్తుందన్నారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న గర్భస్థ శిశువుల్లో క్రోమోజోముల్లోని 21వ జతలో ఒక క్రోమోజోమ్ అదనంగా ఉంటుందన్నారు. ఫలితంగా వ్యాధి ఉన్న వారిలో శారీరక, మానసిక ఎదుగుదల సరిగా ఉండదన్నారు. మేనరిక వివాహాల వలన, 35ఏళ్ల కన్నా ఎక్కువ వయస్సులో మహిళ బిడ్డను కంటే, అటువంటి వారికి డౌన్ సిండ్రోమ్ లక్షణాలతో పిల్లలు పుట్టే అవకాశం ఉన్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక



ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో సిఎం క్యాంప్ కార్యాలయంలో విశాఖకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. ఉత్తర నియోజకవర్గ నాయకులు జివి.రవిరాజు, బొగ్గు శ్రీనివాస్, జనసేన నాయకులు బొడ్డేటి అనురాధ తదితరులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ :సంక్షేమ పాలన కోసం మళ్లీ వైసిపిని గెలిపించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన 10 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వారికి కండువాలు వేసి వైసిపిలోకి ఉమాశంకర్ గణేష్ ఆహ్వానించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, సర్పంచ్ యలమంచిలి రఘుచంద్రరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం మండలంలోని గురందొపాలెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 15 కుటుంబాలు మంగళవారం వైసిపి చేరాయి. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలంలో టిడిపికి కంచుకోట వంటి బూరుగుపాలెం పంచాయతీ శివారు రామారాయుడు పాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు



నర్సీపట్నం ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైసిపిలో చేరికలు

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

- సీనియర్ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని నర్సీపట్నం సీనియర్ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు.. తాను 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో ఉన్నానన్నారు. గతంలో బిఎస్‌పి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. ఆత్మాభిమానం చంపుకొని ఇతర పార్టీలతో ప్రయాణించడం ఇష్టం లేక, వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని వెల్లడించారు. ఏ రాజకీయ పార్టీలతో తనకు విభేధాలు లేవన్నారు.

ఆర్‌టిసి బస్‌లను పునరుద్ధరించండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని మారుమూల గుంటసీమ ప్రాంతానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనదారులు తమకు నచ్చిన విధంగా అధిక ఛార్జీలను వసూలు చేస్తూ దోచుకుంటున్నారని, అంతేకాక పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో గమ్యం చేరే పరిస్థితులు లేకపోగా, మితిమీరిన ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని ప్రయాణం చేస్తున్నామని వాపోతున్నారు. గతంలో ఉన్న ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని తక్షణమే పునరుద్ధరించాలని గుంటసీమ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

తాగునీటి వనరులపై సమీక్ష



సమీక్షా సమావేశంలో
మాట్లాడుతున్న అల్లూరి కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి -పాడేరు: రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికబద్ధంగా అన్నిచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌డబ్ల్యుఎస్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుచున్న ఎన్‌హెచ్ 16-ఇ పనుల వల్ల అనేక ప్రాంతాలలో పైపులైన్లు దెబ్బతిని, నీటి సరఫరాకు కలుగుతున్న ఆటంకాలను వెంటనే సరిచేయాలన్నారు. ముఖ్యంగా రంపచోడవరం నుండి గంగవరం వెళ్ళే రహదారిలో పైప్‌లైన్లు పాడైనందున వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. పాడేరులో ఒక కిలోమీటరు మేర పాడైన పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు.

జిల్లాలోని 98,639 చేతి పంపులలో 228 పనిచేయటం లేదని, వాటిని ఈ నెల 31లోగా బాగుచేసి, ఆయా గ్రామాలకు మంచినీరు అందించాలని ఆదేశించారు. 29 రక్షితనీటి పథకాలకు సంబంధించి 16 మోటార్లు పాడయ్యాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని, అవసరమైతే స్టాండ్‌బై మోటార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోలార్ పంప్‌సెట్ల నిర్వహణపై డిపిఒకొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్,, డిఎల్‌డిఒ శాంతలక్ష్మి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ, దృష్టి పెట్టాలని, పాడైన వాటిని వెంటనే బాగుచేయించాలని కలెక్టర్ ఆదేశించారు.

కొండశిఖర గ్రామాలపై ప్రత్యేక దృష్టి

హిల్ టాప్ గ్రామాలలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ రాచకిండాం గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించినందున తక్షణమే నీటిసదుపాయం కల్పించాలని సూచించారు మరమ్మత్తులకు ఆయా పంచాయతీలలో ఉన్న నిధులను వినియోగించాలన్నారు.

వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలలో బోర్ మెకానిక్ లేనందున ఆయా మండలాలో మెకానిక్‌ను అద్దె ప్రాతిపదికన తీసుకోవాలని సంబంధిత ఎంపిడిఒలను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ లీలాకృష్ణ, ఎస్‌బిఎస్ నంద్, రమేష్‌కుమార్ రావు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను చట్టసభలకు పంపండి

పాడేరు మన్యంలో విస్తృత ప్రచారం — **గ్రామాల్లో బృందాలుగా సిపిఎం సమావేశాలు**

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులకు గెలిపించి చట్టసభలు పంపించాలని ఆ పార్టీ జిల్లా నాయకులు పి బాలదేవ్, సుంకరమట్ట సర్పంచ్ జి చిన్నబాబు పిలుపునిచ్చారు. మంగళవారం సుంకరమెట్ట పంచాయతీ సిపిఎం నేత సిహెచ్ గురుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో కనీన మౌలిక వసతులతోపాటు, జిఒ 3 రద్దు, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన, ఆదిబోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం, ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు, పోడుభూములకు పట్టాలు ఇలా ఎన్నో సమస్యలు తిష్టవేసి ఉన్నా, ఇప్పటివరకు ఎంపి, ఎమ్మెల్యేలుగా గెలుపొందిన ప్రధానపార్టీల నేతలు వీటి పరిష్కారానికి కనీస చర్యలు చేపట్టలేదన్నారు. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్‌లకు పంపితే, ఇటువంటి సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించి, వాటి పరిష్కారాలకు చర్యలు చేపట్టే అస్కారం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం బలపరిచే అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని, ఆదివాసీలంతా అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేయనున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఎం పంచాయితీ నాయకులు నానిబాబు, అర్జున్, రాజు ప్రసాద్, విజయ, ఆనందరావు, ప్రేమ్ కుమార్, శ్రీను, శేషయ్య, మత్యబాబు, కుమిడి రాము, కేశవ్, అంకుల్, శశికళ భవాని, మధు, రంజిత్, గుండు, సోమర, ప్రసాద్, రామన్న, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత బాలదేవ్

మైనింగ్ మాఫియాను ఓడించండి

అరకులోయ రూరల్:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మైనింగ్ మాఫియాను ఓడించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు. పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మాదల పంచాయతీ దాబుగుడలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మారుమూల గ్రామాలైన దాగుగుడ, దోమలజోరు, రక్తకండి, పాలమనవలస, పొట్టంగిపాడు, సరుబెడ్డ, చిట్టంగొంది, తుంగగడ్డ గ్రామాలు కనీసం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారే తప్ప, తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవులను, ఆదివాసీల హక్కులు కాపాడే వారికి తమ మద్దతు ఉంటుందని గ్రామస్థులు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల నాయకులు పాంగి రామన్న, కుమిడి రమేష్ మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాడుతున్న సిపిఎం ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇన్నాళ్లు వైసిపి, టిడిపి, ఇతర పార్టీల ప్రతినిధులను చట్టసభలకు పంపినా, వారంతా గిరిజన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా, జిఒ 3 ద్దు, బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాల్లో చేర్చడం, ప్రకృతి పర్యావరణాన్ని మంటగలిపి మైనింగ్, హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుమతులు వంటి కొత్త సమస్యలను సృష్టించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాకంటక చర్యలకు పాల్పడుతున్న అధికార వైసిపితోపాటు బిజెపి, వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు కొర్రా అప్పన్న, గెమ్మెలి చందు, తామల శ్రీను, పాంగి రాము, శిరగం కొములు (ఫీసా ప్రెసిడెంట్) శిరగం గురుమూర్తి, కిండంగి కొమ్ములు, టి సోమేశ్, జి భాస్కరరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సిపిఎం విస్తృత ప్రచారం

అనంతగిరి : అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల నాయకులు సివేరి కొండలరావు, జె. భీమన్న కోరారు. మంగళవారం వారి నేతృత్వంలో రెండు సిపిఎ బృందాలు మండలంలోని వేంగ్డ, లుంగపర్తి పంచాయతీల్లో పర్యటించి, విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించి, చట్టసభలకు పంపాలని పిలుపునిచ్చారు. గిరిజన సమస్యలపై నిర్లక్ష్యం వహించే ప్రధానపార్టీల అభ్యర్థులను ఓడించాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అప్పన్న, రామన్న పాల్గొన్నారు.



అరకులోయలో ప్రచార సభలకు హాజరైన గిరిజనులు



అనంతగిరిలో ప్రచారం చేస్తున్న గిరిజనులు

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంధ్య

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం మండలం వేములపూడి ఎపిమోడల్ స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూపుల్లో చేరేందుకు విద్యార్థులు apms.apcfss.in, cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలని సూచించారు.

కొత్తఎల్లవరంలో పోలీసుల పల్లెనిద్ర


పల్లెనిద్రలో పాల్గొన్న సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామ రామాలయం వద్ద సోమవారం రాత్రి నర్సీపట్నం రూరల్ సిఐ హరి, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వివరించారు..

ఐదెకరాల జీడితోట దగ్ధం

గొప్పూరులో ఘటన : రూ.లక్షల్లో పంట నష్టం

లబోదిబోమంటున్న బాధిత గిరిజన రైతులు


మంటలకు దగ్ధమౌతున్న జీడి తోట

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలో జాలంపల్లి పంచాయితీ గొప్పూరు గ్రామంలో గిరిజన రైతులకు చెందిన ఐదెకరాల జీడి మామిడి తోట మంగళవారం ఉదయం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో కాలిపోయినట్లు రైతులు ఆవేదన చెందుతన్నారు. గొప్పూరు గ్రామానికి చెందిన కురచా పెంటారావు, బోయిన గుందిరాజు రైతులు చెందిన జీడి మామిడి తోట కాపుకు రావడంతో పంట కోసం ఎదురుచూస్తున్న తరుణంలో తమ జీడితోట కాలిపోవడంతో రూ.లక్షల్లో రావాల్సిన ఆదాయాన్ని కోల్పోయామని, అంతేకాక తోటల్లోని చెట్లు కాలిపోవడంతో భారీఅస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద గిరిజన రైతుల కుటుంబాలకు చెందిన తోటలు అగ్నికి ఆహుతై, తీవ్ర నష్టం జరిగిన నేపథ్యంలో తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత గిరిజన రైతులు వేడుకుంటున్నారు. తోటల నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు స్పందించి, పరిశీలించి, పంటనష్టాలను ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

తాడేలవీధిలో తాగునీటికి కటకట

- పాడైన కుళాయిలను పక్షమైనా పట్టించుకోని పంచాయతీ
- మరమ్మతులకు తీసిన గోతులతో పొంచి ఉన్న ప్రమాదం
- స్పందించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక


ఆందోళన చేస్తున్న తాడేలవీధి మహిళలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : మండల కేంద్రమైన ఎస్.రాయవరం తాడేలవీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు వేడుకుంటున్నారు. వీధి కుళాయిలు పాడవ్వడంతో మరమ్మతులు చేసేందుకు పదిహేను రోజుల క్రితం గోతులు తవ్వి వదిలేశారని, దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతేకాక తవ్వి వదిలేసిన గోతుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు పడి దెబ్బలు తగిలించుకుంటున్నారని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి ఆరోపించారు. కుళాయిల్లో నీరు రాక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పంచాతీ కార్యదర్శి సత్యన్నారాయణకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే తాడేల వీధి కుళాయిలను బాగుచేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే సచివాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని వివరణ కోరగా ఇప్పటివరకు సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

వికలాంగులకు భవనం కేటాయించాలి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : మాకవరపాలెం మండలంలో వికలాంగులకు భవనం కేటాయించాలని వికలాంగుల మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు టి.సతీష్ కోరారు. మంగళవారం ఆర్‌డిఒ జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అసిస్టెంట్ కలెక్టర్ సహాయ సహకారాలతో జనవరి 2వ తేదీన 10 మంది వికలాంగ సభ్యులు గ్రూపుగా ఏర్పడగా, ఇపుడు 150 మందికి చేరారన్నారు. వికలాంగులకు ఉపాధి, వసతికి చిరు చేతివృత్తుల పరిశ్రమలను నిర్వహించుకొని, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఉపాధి పొంది స్వశక్తితో జీవనోపాధి పొందాలని చూస్తున్నామన్నారు.

గ్రూపు సమావేశం పెట్టుకునేందుకు అనువైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 150 మంది సభ్యుల గ్రూపు నిర్వహణకు అద్దెంటిని తీసుకుని, తమకు వచ్చిన ఫించను డబ్బులతో దాన్ని నిర్వహిస్తున్నామని, దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.. మాకవరపాలెం మండలకేంద్రంలో అప్పటి అనకాపల్లి ఎంపి నిధులతో ప్రభుత్వ భవన నిర్మాణం చేపట్టారని దాంట్లో నిర్వహించిన తారా స్వచ్ఛందసంస్థ 15ఏళ్లగా దాన్ని ఖాళీ చేయడంతో నిరుపయోగంగా ఉందన్నారు. ఆ భవనాన్ని వికలాంగుల సంఘం నిర్వహణకు కేటాయించాలని అభ్యర్థించారు.

ఏటికొప్పాక సుగర్స్‌ను తెరిపించాలని వినతి



వైసిపి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులకు వినతిపత్రాలను ఇస్తున్న సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : ఎస్ రాయవరం మండలంలో ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే అంశాన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాయకరావుపేట వైసిపి అభ్యర్థి కంబాల జోగులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వంగలపూడి అనితలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.దీనిపై వారు స్పందిస్తూ, తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎం.రాజేష్, ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు జి.గోవిందరావు, కె.సత్యనారాయణ, ఎ.నారాయణమూర్తి, కె.వెంకటేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు పౌర్ణమి సందర్భంగా గ్రామ పురవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను రథంలో ప్రతిష్ఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, గోవింద నామస్మరణతో స్వామి రథాన్ని లాగారు. పౌర్ణమి సందర్భంగా రాత్రంతా జాతర జరిగింది. ఉపమాక భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన


రావికమతంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రావికమతం ఎంపిడిఒ బాలాజీరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మహిళా ఓటర్లకు స్వీప్ 24 ప్రోగ్రాంలో భాగంగా ఎన్నికల నిబంధనలు, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తాజా ఎన్నికల్లో వృద్ధఓటర్లకు కొత్తగా అమల్లోకి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, నచ్చిన నేతలను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. శాంతియుత వాతావరణంలో ఓటు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లును ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. మండల వ్యవసాయ శాఖాధికారి రూప, వెలుగు ఎపిఎం తిలక్, పలువురు బిఎల్‌ఒలు పాల్గొన్నారు

ఎన్నికల ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎన్నికల ప్రచారానికి అవసరమైన అన్ని అనుమతులు పొందాలని పాయకరావుపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజకీయ పార్టీల నేతలు సభలు, సమావేశాలు నిర్వహించేందుకు, వాహనాలు ,మైక్ సెట్, స్పీకర్లు, జెండాలు,ఫ్లెక్సీల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. వీటన్నిటికీ ఆన్‌లైన్‌లోఅనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు లేనియెడల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేసులు నమోదు చేస్తాయన్నారు. అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 31లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -పాడేరు: వివిధ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పలు తరగతులలో ప్రవేశానికి అల్లూరి జిల్లా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకులం కోఆర్డినేటర్ జె సంధ్యభార్గవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. భీమిలి అచ్యుతాపురం గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు, 6 7 8 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తాటిపూడి బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా గురుకులాల్లో ప్రవేశం కోరుకునే విద్యార్థులు ఈనెల 31లోగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు వచ్చేనెల 25న పాడేరులోని పలు కేంద్రాలలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.